# లాలి

ఏం అబద్ధం ఆడుదామా...

–అన్నయ్యతో, ఏం అబద్ధం ఆడుదామా... ఆడుతే వనరుగా ఉంటుందా అని, పావుగంటనుంచీ, ఆలోచిస్తూ కిటికీలో ఇరికి–ఇరికి కూర్చుని ఉన్నాను. ఆయన, నిదానంగా, ముఖానికి సర్వవిధాలా అడ్డంపెట్టుకుని దండక మంత... అంతకు ఇనుమడించిన భక్తితాత్పర్యాలతో హిందూ పత్రికను ఘోషిస్తూ గ్రోలుతున్నాడు.

"అ–న్న–య్యా"... మూడు అక్షరాలు... ద్విత్వంతో కలిపి... మూడు శ్రుతులుగా! సారించాను. ఆయనగొంతు ఫిడేలుతీగె పుటుక్కుమన్నట్టు ధ్వనించింది.

"మరే... "

...ఆయన, పేపర్ మడచి పొట్టకు ఆనించుకుని లేచి కూర్చునే యత్నంలో, వెన్ను, రవంత ఎగురవేసినట్లై కుర్చీకి అల్లిన పేము, గజిబిజి పడ్డది. నా నోటివెంట, ఆ తరువాత ముక్క... అంటే, సంఖ్య... పెగిలి రావడానికి, గుంజాటన పడుతూన్నది.

–ఇంతలో, హుటాహుటి నడలతో, యకాయకి లోపలికి వచ్చేసింది, టక–టక లాడుతూ – ఆ అమ్మాయి.

"మీ యిద్దరిలో ఎవరై ఉంటారు, లక్ష్మింపతిగారు?..." అని అడుగుతూనే, ఓ కుర్చీచేత అంగ యువతలికి వేయించి, దాని చేతిమీద అలవోకగా కూర్చుని, నేలకు అన్చనికాలు, ఉయ్యాల–ఊపుతూన్నది.

ప్రశ్నకు జవాబు తానే అని వీలైనంత తేట తెల్లము చేసేందుకు అన్నయ్య దేహం వల్ల మారిన హైరానుపడ్డది...

"అలాగుటండీ, అయ్యో పాపం మీరా?... అంతే కావాలిలెండి..." ఈ రెండుముక్కలూ ఆ అమ్మాయి కళ్ళు భారతమంత మేర చదివినవి. ఆ తరుణంలో మా వంశాంకురంమీద జాలిపడటంకన్న – నవ్వితే ఆ దోషం పోతుందని నా మనస్సాక్షి ఎన్నో విధాలపోరింది... కాని, యింకా నాకు అంతకు చాలిన వయసులేదు.

"మీకోసమే వచ్చానండీ."

"మంచిది – చాలా సంతోషం..." అంటూన్నది అన్నయ్య మెదిలికలో, ఆయన పడుకున్న కుర్చీ.

"ఒక్క పదివేలు యిప్పించండి"

"పదివేలా? – ఎందుకు?"

"ఎందుకేమిటి? డబ్బు ఎందుకేమిటని అడుగుతారేమిటి ఎక్కడో – పసిపిల్ల వాడికిమల్లే... సరదాగా ఖర్చు చేసేందుకు".

అన్నయ్య మనస్సు, పాపం యీ కుర్రది ఎవరో వెర్రిది అనుకుంటూన్నదని తోచెడి...

"అలాగేనమ్మా... ఇస్తాను దానికేం మహాభాగ్యం!" అంటున్నాయి ఆ పెదవులు... రెండునిమిషాలు చీమ చిటుకు మనకముందే పిడుగుపడ్డట్టూ నోరు ఎత్తడానికి కాచుకుని ఉన్న నిశ్శబ్దంలో గడచిపోయినవి.

"దేనికీ ఆలస్యం?... అంటూంది. కొంచెం చీకాకుగా – అనంతరంబ."

"దేనికీ లేదు... "

"దేనికీ లేకపోతే... ఉంటే ఇవ్వరేం?"

"ఇస్తూంటునిగాం"

"ఎప్పుడో?"

"అమావాస్య వెళ్ళిన మరునాడు... ఆ మాట విన్న ఉత్తరక్షణంనుంచీ అన్నయ్య ఎన్నడు తెలుగుమాట్లాడినా తగినిచేదుగా ఉంటుంది నాకు. ఒక్కొక్కళ్ళ మాతృభాషలో అంతవిషం ఉంటుందని – నాకు అంతకుముందు ఎన్నడు ఆపోవలేదు."

"–ఠీక్–కాని, అది సజావుగా వెళుతుందని ఏమిటి మీకు నమ్మకం?"

అన్నయ్య కళ్లజోడు మీదికి అపక్వాహారి – కళ చిమ్మింది... ముక్కు కొనమాత్రం "పోదూ" దాని లెక్క ఏమిటి అన్నంతగా దద్దరిల్లింది.

మరో మూడునిమిషాలు, నిశ్శబ్దంలో మౌనం... సర్వమౌనం.

"తగని ఆలస్యం అవుతూంది" అని, తనలో తాను అనుకుంటూన్నది... జ్ఞాపకం చేసుకుంటూన్నట్టు.

–"కొన్ని వేళల ఆలస్యం తొందరగానే అవుతుంది సుమీ" చిన్నప్పుడు ఎన్నడో మరచిపోయిన పాఠం అన్నయ్య గొంతులో భారసాల చేసుకుంటూన్నది.

"అలాగైతే... తెలిసిచేసే పాపమేనా దేవిభక్తులు?"

"అంటే ఏమిటో, అన్నయ్యకు ఏకోశానా, అర్థం కాలేదు... అని ఏ పాపము ఎరుగని నాకే తెలిసిందే."

"వరాలు అన్నింటికీ దేనికి దానికి ఖరీదు గట్టనేర్చిన షరాబులు –" ఇంకా అన్నయ్యకు ఆమాటలో అంతుచిక్కలేదు.

"షరాబు సంచీ కాలీ –" గడుసుదనంలో జవాబు అనుకుంటానా ఇది, కాదు, మాటకుమాట పొత్తుకుదరక పుట్టిన వాఙ్మయపు – తెగులు.

"ఖాలీ అయితేనే మంచిది – మోత బరువు తప్పుతుంది. రవంత కాగితంమీద నిలువు గీతగీసి నాలుగు సున్నాలు చుట్టడం చేతనవుతుందా... ధీమంతులకు?"

"తిన్న యింటి వాసాల లెక్క తేలుతుందని కాదు గాని... ఉన్నది కొంతమేర అయినా లేనిదానిలో జమ అవుతుంది..."

నాకే యీ ముక్కలకు తలాతోకా అందటంలేదు... పట్టుమని పదిముక్కల పాండిత్యానికైనా నోచుకోని అన్నయ్యకు జవాబు తలలో రాజడం తరమౌతుందా. నేను భక్తిశ్రద్ధలతో అతి – నమ్రతగా యీ నాటకాన్ని, ఆలకిస్తున్నాను.

..."ఇంకో సున్నాచుడితే లక్ష... గ్రంథం పెరుగుతుంది కాదూ..." చిన్నదాని పెదవులు మన్ననగా ఎక్కాలు వల్లిస్తున్నాయోహోయ్.

ఆ అమ్మాయి, చాలా బాగుంది కదు .

ఆ కళ్ళు...అబ్బ...ముద్దొస్తున్నాయి కాదూ...

ఆ చెంపలు, తొలి-పూత గులాబీలు కాదూ...

ఆ గొంతు, అంతులేని - తీపి కాదూ...

ఒక్క చిందైనా చిమ్మకుండా, అందం ఏకధారను ఒలికింది కాదూ...

సన్నగా కలువరించుతూంది...

మనసుకన్నా, అంతు చిక్కనీకుండా, యెన్నడో ఈడేరే నా వయసు,

అన్నయ్య కనుసన్నల్లో ఇరకాటం యెక్కువౌతూంది. పడకకుర్చీలో పక్క కుదరకుండా, అటూ-యిటూ కదలకుండా మసలుతున్నాడు.

"ఇక్కడేం తేరగా పోసుక్కూచోలేదు..." అంటాడా చివరకు, యిందాకా రానిచ్చి, పచ్చి అజ్ఞానై?

"కళ్ళెదుట కనబడుతూంటే ఖర్చుచేయాలేమోనని భయమన్నమాట!... అంటే ఆ కొంటె కూన..."

అన్నయ్య ఎప్పుడు లేచి లోపలికి వెళ్ళిపోయినాడో, నేను గమనించలేదు. ఎవరీ చిన్నది? యెంత ముచ్చటగా ఉంది ఈ రాలుగాయతనం! అనుకుంటున్నాను, అది మరచి...

నా వంక చూసిందో లేదో, అడిగేందుకు చూపులకు భయం వేసి, తల యెత్తవద్దని బ్రతిమాలినవి.

"ప్రస్తుతం, తమరు, యెంత ధరలో ఉన్నారు?..."

-నన్ను కాదు కదా అనుకున్నాను.

"మిమ్మల్నే..."

నన్నేనని యింకా నమ్మేందుకు... యెందుకో మొగం చెల్లడం లేదు.

"పౌను యెంత ఖరీదు?"

"ఏమంటున్నా వినిపించుకోకుండా ఉంటేనో?"

"యెందుకండీ అంత బిడియం? - ఏడు మల్లెపూల ఎత్తుతూగే ఆడపిల్లలకైతే... ఎంత సొమ్ము గిట్టుతుందనే బాధ ఉండాలి. కాని... మీకు ఎందుకండీ... ఏదో ధర సిసలు చేయండి - మాటాడ రేం... ఓహో అదా సంగతి?... అంగడిలో వస్తువును అడుగుతానేమిటి - అమ్మజూపిన ఆసామి అంటూ వేరే ఉండగా... పాపం దాని కేమన్నా నోరా - వాయా?... నా తెలివి ఇంతలో ఉంది..."

నాకు అర్థం అయింది: దయచేసి మీరు యెవ్వరూ అర్థం చేసుకునేందుకు యత్నించకండి... పెద్దలు చేసే తప్పు లన్నింటికీ మేమే బాధ్యులము అనకండి బాబూ... అన్నయ్య నా పాలిటి యముడల్లే...

అమ్మయ్య!... అన్నయ్య నా పాలిటి దైవమల్లె ప్రత్యక్షమైనాడు...

"ఏదీ?" అన్నది మగరాయడిలాగా...

"ఏమిటి" అని తడబడ్డది అన్నయ్య...

"మీ చిన్నదాని పాణిగ్రహణంచేసే ధీరుడికి కట్నం కానుక"

అంత మనిషీ అన్నయ్య నీరసంగా తూలిపోతున్నాడు...

చిన్నది యెవరు? - అని అడుగడు కద, అన్నయ్య!... నన్ను శిఖండిగానైనా ఉండనియ్యడా ఏం?...

“కన్నెలకు సిగ్గరితనం అలంకారమని కన్యాశుల్కంలో వ్రాసిపెట్టనందువల్ల... నాకు అందులో నమ్మకం లేదు. వన్నెలూ-చిన్నెలూ యెవరు తెచ్చుకోకుండానే కులికే...”

“ఊఁ...కులికే...” అన్నయ్య, ఇది అనవసరంగా చేసిన ధ్వని –

“కులికే మీ బాలా కుమారుడి పలుకే బంగారమైతే... మీ పదివేలూ బాకీ తీరేందుకు... మా నాథుణ్ణి ఒక్కసారి పలుకరించితే చాలును కదండీ – జమ పడిపోతుంది! మా తండ్రి యెంత అదృష్టవంతుడండీ – కుబేరుడై పోడూ రేపీపాటికి? – పదివేలకు, దినవెచ్చంగా బారువలాది బంగారం కులికే రత్నాన్ని – పరు లెవ్వరికో అమ్మడానికి తయారుకావడం – మీకే తగునండీ – ధర సిసలేనా అని మానాన్న కనుక్కురమ్మంటే –”

గరళం పోసినవాడికి వేడి కమ్ముకుంటూన్నట్టు, అన్నయ్య కళ్ళల్లోకి క్రమంగా ప్రాణం వస్తూన్నది – ఉండుండి రెండు రెప్పలూ ఒక్కసారి అమ్మయ్యోగా ఆవలించినవి –

“అవునండీ – నేనే మీ మరదలిని” అని రంపకోత కోస్తున్నాయి ఆ అమ్మాయి చూపులు.

“అన్నయ్యకేం? అక్కడ నుంచోకుండా, తానైతే తప్పించుకుపోగలడు కాని –”

నాకు తగని సిగ్గవుతున్నదబ్బా!

ఏమైతే నేం లాభం!

ఏ జన్మకైనా – నా భార్యకు భార్యను కమ్మని – నన్ను దీవించేందుకు నోచుకోరా – నా యిలవేల్పులు –

తల యెత్తిచూశాను – ఆ చిన్నది – సిగ్గుపడుతూ చిరునవ్వుగా – చీర చెంగు నా కళ్ళకు కమ్మేసి మాయమౌతుంది...

మగతనంలోకి – జన్మలో మేల్కొనకుండా పరవశించిన వైష్ణవ భాగవతులు – నాకన్న, నీకన్న – యెంత ధన్యులో తెలుసుకోవడం యెంతదారుణం!

“ఏదయ్యా! భామ?”– అన్నయ్య దహరాకాశం ఉరిమింది.

నా మనసు పెళ్ళికూతురికిమల్లె దాక్కునేందుకు, తలుపుచాటు యెక్కడా అని సొంట్లు శోధించతూన్నదని ఊహించి ఆనందించే నేర్పైనా అన్నయ్యకు లేనందుకు నాకు, యెంతో సంతోషంగా ఉంది.

– సరే కాని ఇహ అన్నయ్యను డబ్బు యివ్వమని, ఏం మొగం పెట్టుకుని అడగనూ?–

★ ★ ★